# పొంగి పొర్లుతున్న వాగులు, వంకలు



నర్సంపేట : ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు



నర్సంపేట రూరల్ : నీటితో కళకళలాడుతున్న మాధన్నపేట పెద్ద చెరువు

- అలుగు దుంకుతున్న చెరువులు
- శిథిలావస్థలో ఉన్న ఇండ్లను పరిశీలించిన ప్రజాప్రతినిధులు

నర్సంపేట రూరల్: ఐదు రోజులుగా ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలకు మండలంలోని అన్ని గ్రామాల్లోని వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. చెరువులు, కుంటలు నీటితో కళకళలాడుతున్నాయి. మండలంలోని ముగ్ధుంపురం ఊర చెరువు, గురిజాల పెద్దం చెరువు, మహేశ్వరం పాన్ చెరువు, పెద్ద చెరువులు మత్తళ్లు దుంకుతున్నాయి. పలు గ్రామాల్లో శిథిలావస్థలో ఉన్న ఇండ్లను ప్రజాప్రతినిధు లు, అధికారులు పరిశీలించారు. మండలంలోని లక్నేపల్లి, రామవరం గ్రామాల్లో వర్షాలకు దెబ్బతిన్న, శిథిలావస్థకు చేరుకున్న ఇండ్లను ఆయా గ్రామాల సర్పంచ్‌లు గొడిశాల రాంబాబు, కొడారి రవన్న, కార్యదర్శులు అనితారెడ్డి, నీలం వీరేశ్‌కుమార్, వార్డు సభ్యులు పరిశీలించారు.

**నిండుకున్న మాధన్నపేట పెద్ద చెరువు..**

నర్సంపేట రూరల్: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు జిల్లాలోనే అతిపెద్ద చెరువైన నర్సంపేట మండలంలోని మాధన్నపేట పెద్ద చెరువు మత్తడికి చేరువైంది. ప్రస్తుతం మాధన్నపేట పెద్ద చెరువు నీటితో కళకళలాడుతుంది. మరొక్క రోజు భారీ వర్షం కురిస్తే మత్తడి పోసే అవకాశాలు మెండుగా ఉన్నాయి. కురుస్తున్న వర్షాలకు మాధన్నపేట పెద్ద చెరువులోకి భారీగా వర్షపు నీరు వచ్చి చేరుతున్నది. శనివారం నాటికి ఈ చెరువు 16.6 ఫీట్ల నీటి సామర్థ్యాన్ని కలిగి ఉన్నది. గతేడాది ఆగస్టులో మాధన్నపేట చెరువు అలుగు పోసింది. ఈ సారి నెల రోజుల ముందుగానే మాధన్నపేట చెరువు మత్తడి పడే అవకాశం ఉన్నది. మాధన్నపేట చెరువులోకి 17 ఫీట్లు వచ్చి చేరితే చెరువు అలుగుపోస్తున్నది. ఈ చెరువు కింద ఉన్న అన్ని కాల్వల కింద ఆయకట్టు రైతులు వరినాట్లు జోరుగా చేపట్టారు.



నర్సంపేట రూరల్: ఉధృతంగా ప్రవహిస్తున్న పాకాల వాగు

**నర్సంపేటలో..**

నర్సంపేట: మూడు రోజుల పాటు రాత్రింభవళ్లు కురిసిన వర్షం, రెండు రోజుల నుంచి పగలు గెరువు ఇస్తున్నది. రాత్రి కాగానే వర్షం జల్లులు పడుతున్నాయి. వర్షాలతో చెరువులు, కుంటలు మత్తళ్లు దుంకుతున్నాయి. రైతులు వ్యవసాయ పనులో నిమగ్నమయ్యారు.



అలంకానిపేటలో కుట్టుశిక్షణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సర్పంచ్

## ఎమ్మెల్యేకు రుణపడి ఉంటాం..

నెక్కొండ, జూలై 22 : మహిళలకు ఉచితంగా కుట్టుశిక్షణను అందించి వారికి ఉపాధి అవకాశాన్ని చూపేందుకు నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ఏర్పాటు చేసిన కుట్టు శిక్షణ కేంద్రాల నిర్వహణ బాగుందని అలంకానిపేట సర్పంచ్ మాదాసు అనంతలక్ష్మీరవి అన్నారు. అలంకానిపేటలో ఏర్పాటు చేసిన కుట్టు శిక్షణకేంద్రాన్ని శనివారం ఆమె పరిశీలించారు. కుట్టు శిక్షణకు హాజరైన మహిళలతో మాట్లాడారు. మహిళలకు ఉచితంగా ఏర్పాటు చేసిన భోజనాలను పరిశీలించి, మహిళలతో కలిసి సర్పంచ్ భోజనం చేశారు. రుచికరమైన భోజనాన్ని అందించడం, ఉచితంగా శిక్షణను అందించడం, శిక్షణపొందిన వారికి టెక్స్‌టైల్‌పార్క్‌లో కొలువును చూపించేందుకు రంగం సిద్ధం చేయడం హర్షణీయమన్నారు. తమ గ్రామంలోని మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్న ఎమ్మెల్యేకు రుణపడి ఉంటామన్నారు.

## 'కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి తగదు'



రాస్తారోకో చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు, విద్యార్థులు

నర్సంపేట, జూలై 22 : మణిపూర్ ఘటనలో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి తగదని ప్రజా సంఘాల నాయకుడు కే ప్రణయదీప్ మాదిగ, విద్యార్థి సంఘం నాయకులు బీ నరేశ్, మొగిలిపల్ల సందీప్ అన్నారు. శనివారం నర్సంపేటలోని అమరవీరుల స్థూపం వద్ద విద్యార్థి, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో మణిపూర్‌లో మహిళపై జరిగిన సంఘటనను నిరసిస్తూ రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలకు రక్షణ కల్పించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ఈ సంఘటనకు పాల్పడిన దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బీసీ వర్గాలపై దాడులు చేస్తున్న బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించడమే లక్ష్యంగా పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గడ్డమీది బాలకృష్ణ, కొమ్ముక రవి, ప్రశాంత్‌భూషన్, రవీందర్, రమ్య, కావ్య, సునీత, ప్రవళిక, భాగ్యశ్రీ, ప్రవళిక, అనూష, కృష్ణవేణి, నాగమణి, సుమలత, రమాదేవి, స్వప్న పాల్గొన్నారు.

**కండ్లకు నల్లరిబ్బన్ కట్టుకుని నిరసన..**

మణిపూర్‌లో మహిళపై దాడి సంఘటనపై కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని ఎంసీపీఐయూ జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేశ్ అన్నారు. శనివారం నర్సంపేటలోని అంగడి సెంటర్‌లో కండ్లకు నల్లరిబ్బన్ కట్టుకుని నిరసన తెలిపారు. దాడికి పాల్పడిన దోషులను శిక్షించాలని కోరారు. వంగాల రాగసుధ, కొమురయ్య పాల్గొన్నారు.

## మణిపూర్ నిందితులను కఠినంగా శిక్షించాలి

ఖిలావరంగల్, జూలై 22: మణిపూర్‌లో మహిళలపై అఘాయిత్యాలకు ఒడిగట్టిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఐద్వా జిల్లా ఉపాధ్యక్షురాలు రంగరాజు విజయ డిమాండ్ చేశారు. శనివారం బట్టలబజారులో మణిపూర్ ఘటనకు వ్యతిరేకంగా నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలపై లైంగిక దాడులు, నగ్నంగా ఊరేగించి వికృత చేష్టలు చూసి కేంద్ర ప్రభుత్వం సిగ్గుపడాలన్నారు. నల్ల రేణుక అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎండీ షమీమ్, ఎల్ సరిత, ఎస్ రాజకళ,రాజమ్మ, కే సరిత, బీ సువీల, పీ ఇందిర, హేమంత, రేష్మ, లలిత పాల్గొన్నారు.




నిరసన తెలుపుతున్న ఐద్వా నాయకురాలు

## అదనపు కలెక్టర్ మహేందర్‌జీకి ఘనంగా సన్మానం

ఖిలావరంగల్, జూలై 22: వరంగల్ ఆర్డీవోగా విధులు నిర్వర్తిస్తున్న సీహెచ్ మహేందర్‌జీకి అదనపు కలెక్టర్‌గా హనుమకొండ జిల్లాకు బదిలీ అయ్యారు. కాగా, శనివారం రాత్రి వరంగల్ కలెక్టరేట్‌లో వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్యతో పాటు ఉద్యోగ సంఘాలు, వివిధ శాఖలకు చెందిన అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది శాలువతో సన్మానించి, పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు శ్రీవత్స కోట, అశ్విని తానాజీ వాకాడే, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు గజ్జెల రాంకిషన్, ప్రధాన కార్యదర్శి గాజె వేణు, వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.



మహేందర్‌జీని సన్మానిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య, ఉద్యోగ సంఘాల నాయకులు

## 'పంట చేలల్లో నీరు నిల్వ ఉండొద్దు'

మల్హర్, జూలై 22 : ఇటీవల కురుస్తున్న వర్షాలకు పత్తి, మిరప నారుమడుల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని వ్యవసాయ అధికారి ముంజ మహేశ్ రైతులకు సూచించారు. శనివారం మండలంలోని నాచారం, అన్‌సాన్‌పల్లిలోని పత్తి, మిరప పంటలను పరిశీలించారు. వ ర్షాలకు నీరు నిలిచి పంట ఎర్రబడుతున్నదని తెలిపారు. 19:19:19 లేదా నానో యూరియా, నానో డీఏపీని పిచికారీ చేయాలన్నారు. కాపర్ ఆక్సీ క్లోరైడ్ మందు 2 గ్రా ములు లీటర్ నీటికి కలిపి పత్తి మొక్క మొదళ్ల వద్ద పో యాలన్నారు.

## పండ్ల తోటల సాగుకు ప్రభుత్వ ప్రోత్సాహకం

మహదేవపూర్, జూలై 22 : ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాన్ని వినియోగించుకొని పండ్ల తోటల సాగు ను మండలంలోని రైతులు చేపట్టాలని హార్టికల్చర్ అధికారి డీ రమేశ్ సూచించారు. ఐదెకరాల లోపు భూమి ఉం డి, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో జాబ్‌కార్డ్ ఉన్న ఎస్సీ, ఎస్టీ, సన్న, చిన్నకారు రైతులు అర్హులన్నారు. ఎస్సీ, ఎస్టీలకు 100 శాతం, చిన్న, సన్నకారు రైతులకు 90 శాతం సబ్సిడీతో డ్రిప్ ఇరిగేషన్ సౌకర్యంతో పాటు పండ్ల తోటల సాగుకు అవసరమైన పెట్టుబడిని ప్రభుత్వం సమకూర్చనుందని తెలిపారు. మండలంలో 53 ఎకరా ల్లో మామిడి, నిమ్మ, నారింజ, కొబ్బరి, డ్రాగన్, సపోట, జామ, సీతాఫలం, మునగ పంటలు సాగు చేసేందుకు నిర్ణయించినట్లు తెలిపారు. ఉపాధి హామీలో గుంతలు తవ్వి మొక్కలు నాటనున్నట్లు చెప్పారు. సాగు కోసం ప్రతి మొక్కకు మూడేళ్ల పాటు నెలకు రూ. 10 చొప్పున, ఎరువులకు ప్రతి మొక్కకు ఏడాదికి రూ. 50 అందజేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న రైతులు ఈ నెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలని రమేశ్ సూచించారు.

## వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలి

- గ్రామాల్లో శిబిరాలు నిర్వహించాలి
- ఐటీడీఏ పీవో అంకిత్

తాడ్వాయి, జూలై 22 : సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలని, అందుబాటులో ఉంటూ సేవలందించాలని ఐటీడీఏ పీవో అంకిత్ ఆదేశించా రు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీని శనివారం ఆకస్మిక తని ఖీ చేశారు. అనంతరం ఓపీ రిజిస్టర్‌ను పరిశీలించారు. వార్డులను సందర్శించి రోగులతో మాట్లాడారు. మలేరియా ప్రభావిత గ్రామమైన కొండపర్తిలో వైద్య శిబిరం నిర్వహించాలని, పారిశుధ్యం కోసం పంచాయతీ కార్యదర్శులతో సమన్వయం చేసుకోవాలని వైద్యులకు పీవో సూచించారు.

**పాఠశాలల్లో పరిశుభ్రతను పాటించాలి**

ఏటూరునాగారం : సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున పాఠశాలల్లో పరిశుభ్రతను పాటించాలని ఐటీడీఏ పీవో అంకిత్ సూచించారు. మండలంలోని మల్యాల గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలను శనివారం ఆయన తనిఖీ చేశారు. వర్షాలు కారణంగా పాఠశాలకు సెలవు ఇవ్వడంతో విద్యార్థులంతా క్రీడా మైదానంలో ఉండడంతో వారిని కలుసుకుని మాట్లాడారు. సిలబస్, ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనంపై ఆరా తీశారు. స్కూల్ బ్యాగులు, యూనిఫాంలు అందాయా అని తెలుసుకున్నారు. వసతి గృహం, కిచెన్, టాయిలెట్స్ బ్లాక్, ఆహార నిల్వల గదిని పరిశీలించా రు.



విద్యార్థులతో మాట్లాడుతున్న పీవో అంకిత్